క్లుప్తంగా

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీలు దొండా రాంబాబు, కిముడు రమణమ్మ

మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారం జగనన్న కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి బుచ్చెయ్యపేట, మాడుగుల జెడ్పీటీసీలు దొండా రాంబాబు, కిముడు రమణమ్మ సోమవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఎంపీ నిధులు రూ.5 లక్షలతో బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ రూ.1.50 లక్షలతో కలిపి రూ.6.50 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ దాడి రాజేశ్వరరావు, వి.ఆర్.ఆర్.పేట సర్పంచ్ యల్లపు విజయకుమార్, పొట్టిదొర ఉప సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ



ప్రమాణం చేస్తున్న సంఘ సభ్యులు

గొలుగొండ: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రహదారి భద్రతపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటిస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వి. శాంతకుమారి, ఏపీఎం మంగ, స్త్రీనిధి మేనేజర్ కనకమహాలక్ష్మి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

గొలుగొండ: నర్సీపట్నం నుంచి మారేడుమిల్లి వెళ్లే ఆర్టీసీ బస్సు తరుచూ మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం నర్సీపట్నం నుంచి బయలుదేరిన ఈ బస్సు చిన్నయ్యపాలెం వద్ద ఆగిపోయింది. దాంతో రెండు గంటల పాటు ప్రయాణికులు రోడ్డుపై పడిగాపులు కాశారు. మరలా నర్సీపట్నం నుంచి మరో బస్సు రావడంతో అందులో వెళ్లారు. అయితే నర్సీపట్నం నుంచి మన్యం ప్రాంతం మారేడుమిల్లికి ఒకటే ఆర్టీసీ బస్సు ఉంది. ఈ బస్సు ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటోంది. దాంతో తరచూ మొరాయిస్తుందని, మరో అదనపు బస్సు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.


అంగన్‌వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాన్ వితరణ



సీలింగ్ ఫ్యాన్ అందజేస్తున్న సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి

దేవరాపల్లి: కలిగొట్ల అంగన్‌వాడీ కేంద్రానికి స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం సీలింగ్ ఫ్యాన్‌ను వితరణ చేశారు. దీన్ని సర్పంచ్ గొర్రుపోటు సుధారాణి అంగన్‌వాడీ సిబ్బందికి సోమవారం అందజేశారు. ఈ నెల 6న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి ఒకే ఫ్యాన్ ఉండటంతో మరొక ఫ్యాన్‌ను వితరణ చేయాలని జెడ్పీటీసీకి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచించారు. ఈ మేరకు తన సొంత నిధులతో ఫ్యాన్ సమకూర్చిన జెడ్పీటీసీకి సర్పంచ్, అంగన్‌వాడీ సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



ప్రిన్సిపాల్ సహదేవుడు

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సహదేవుడు తెలిపారు. ఈ నెల 25 వరకు దరఖాస్తుల స్వీకరణ, 26 నుంచి ప్రవేశాలు, వచ్చే నెల 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ఇక్కడ హెచ్ఈసీ, సీఈసీ, బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో సీట్ల భర్తీకి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పాఠ్యపుస్తకాలొచ్చేశాయ్!

- విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే చేరిన పుస్తకాలు
- పాఠశాలల వారీగా పంపిణీకి ఏర్పాట్లు
- సర్వత్రా హర్షాతిరేకాలు



కాశీపురం హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్ వద్ద..



నాతవరం ఎమ్మార్సీలో పాఠ్యపుస్తకాలు

దేవరాపల్లి: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్య పుస్తకాలు వచ్చేశాయి. ఇప్పటికే తొలి విడతగా మండలంలోని స్టాక్ పాయింట్‌కు చేరుకున్నాయి. మలి విడతలో మిగిలినవి రానున్నాయి. పాఠశాలలు పునః ప్రారంభమైన రోజు నుంచే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవి సెలవుల్లో ముందుగానే పాఠ్య పుస్తకాలు రావడంతో సర్వత్రా హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గత టీడీపీ హయాంలో పాతపుస్తకాలతోనే...

గత టీడీపీ హయాంలో పాఠశాలలు పునః ప్రారంభమైన తర్వాత నెలల గడుస్తున్నా, పాఠ్య పుస్తకాలు అందుబాటులోకి వచ్చేవి కావు. అరకొరగా వచ్చిన కొత్త పుస్తకాలు, విద్యార్థుల వద్ద ఉండే పాత పుస్తకాలతోనే కాలం వెళ్లదీసేవారు. దీంతో విద్యా బోధనలో ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ప్రభుత్వ పాఠశాలలపైనే ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. నాడు – నేడుతో పాటు పలు విద్యా సంక్షేమ పథకాలతో విద్యార్థులను అన్ని విధాలా ప్రోత్సాహిస్తున్నారు. ఇటీవల వచ్చిన పదో తరగతి ఫలితాలే నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

తొలి విడతలో 8,721 పాఠ్య పుస్తకాలు

దేవరాపల్లి మండలంలో డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయం, కేజీబీవీతోపాటు ప్రాథమిక-43, ప్రాథమికోన్నత-6, జెడ్పీ ఉన్నత పాఠశాలలు-9 ఉన్నాయి. వీటికి 28,300 పాఠ్య పుస్తకాలు అవసరమని ప్రభుత్వానికి మండల విద్యాశాఖ అధికారులు ప్రతిపాదించారు. తొలి విడతలో 8,721 పాఠ్య పుస్తకాలు వచ్చాయి. వీటిని కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని మండల స్టాక్ పాయింట్‌లో భద్రపరిచారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ...

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది. అందులో భాగంగా నాడు–నేడు అమలుతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. తరగతి గదుల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ముందస్తుగా పాఠ్య పుస్తకాలు, జగనన్న విద్యా కానుక కిట్లను సైతం విద్యా సామగ్రి స్టాక్ పాయింట్లుకు సరఫరా చేస్తున్నారు. అమ్మఒడి ద్వారా ఏటా రూ.15వేలు అందిస్తూ పేద విద్యార్థుల చదువులకు భరోసా కల్పిస్తున్నారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద తదితర పథకాలతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారు.

తొలి విడత 20 వేలకుపైగా పాఠ్యపుస్తకాలు

నాతవరం: ఎమ్మార్సీ కేంద్రానికి ప్రస్తుతం 20 వేలకుపైగా పాఠ్య పుస్తకాల స్టాకు సిద్ధంగా ఉంది. మండలంలో 62 పాఠశాలలకు 54,570 పాఠ్య పుస్తకాలు అవసరమని ఎంఈవో టి. అమృత్‌కుమార్ ప్రభుత్వానికి నివేదించారు. గతంలో పాఠ్యపుస్తకాలు పాఠశాలలు తెరిచి నెలలు గడిచాక విద్యార్థులకు పంపిణీ చేసేవారు. మారుమూల పాఠశాలలకు విద్యా సంవత్సరం ముగిసినా అరకొర పాఠ్యపుస్తకాలతో కాలం వెళ్లదీసేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో విద్యా కానుక పేరుతో విద్యార్థులకు సకాలంలో అన్ని రకాలు పాఠ్యపుస్తకాలు ముందుగానే అందించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ఎంఈవో నివేదిక ఆధారంగా పాఠ్యపుస్తకాలు, ఇతర సామగ్రి మండల కేంద్రానికి తరలించేందుకు జిల్లా అధికారులు దృష్టి సారించారు. ఈ ఏడాది 9వ తరగతి పూర్తి సిలబస్, 6, 7 తరగతుల్లో కొన్ని పుస్తకాలు మారినట్టు ఎంఈవో తెలిపారు.

త్వరలో మిగతా పుస్తకాలు వస్తాయి



గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠ్య పుస్తకాలు ఈ ఏడాది ముందుగానే మండల స్టాక్ పాయింట్‌కు చేరుకున్నాయి. మిగతా 19,600 పుస్తకాలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి. వచ్చే నెల 10వ తేదీ కల్లా పాఠశాలల వారీగా హెచ్‌ఎంలకు పంపిణీ చేస్తాం. విద్యా కానుక సామగ్రి సైతం మండల స్టాక్ పాయింట్‌కు వస్తున్నాయి.

– సిహెచ్.రవీంద్రబాబు, ఎంఈవో, దేవరాపల్లి

గత టీడీపీ పాలనలో ఆలస్యంగా పుస్తకాలు

గత టీడీపీ పాలనలో పాఠశాలలు పునః ప్రారంభమై నెలలు గడిచినా పాఠ్య పుస్తకాలు వచ్చేవి కావు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే రావడం హర్షదాయకం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నాడు–నేడు నిధులతో కార్పొరేటును తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. పేద విద్యార్థుల చదువుకు భరోసా లభించింది. విద్యా బోధనలో సైతం సరికొత్త విధానాలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల పదో తరగతిలో వచ్చిన ఫలితాలే ఇందుకు నిదర్శనం.

– కొరుపోలు స్వామినాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, దేవరాపల్లి హైస్కూల్

స్పందన అర్జీలకు సత్వరమే పరిష్కారం

- ఆర్డీవో జయరాం ఆదేశం



అర్జీదారుల సమస్యలను వింటున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులను ఆదేశించారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో అర్జీదారుల నుంచి ఆర్డీవో వినతులు స్వీకరించారు. ఫిర్యాదులో స్పష్టత ఉండేలా అర్జీదారులు తగిన ఆధారాలు జతపరచాలని సూచించారు. డివిజన్ పరిధిలోని 12 మండలాల నుంచి 14 వరకు అర్జీలు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూసమస్యలు ఉన్నాయి. స్పందన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఆయా శాఖ అధికారులు బాధ్యత వహించాలన్నారు.



సూచనలు చేస్తున్న తహసీల్దార్ కనకారావు

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం చేయొద్దు

నాతవరం: స్పందన అర్జీలపై తక్షణమే స్పందించకుంటే కలెక్టరు తీసుకునే చర్యలకు బాధ్యలవుతారని తహసీల్దార్ పి.కనకారావు హెచ్చరించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో స్పందనతోపాటు భూరీసర్వేపై వీఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సమస్యలపైనా నిర్లక్ష్యం చేయొద్దన్నారు. మండలంలో మూడో విడత రీసర్వే కింద ఎంపిక చేసిన గన్నవరం, చెర్లోపాలెం, ములగపూడి, బెన్నవరం రెవెన్యూ గ్రామాల్లో రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించాలన్నారు. రీసర్వే పారదర్శకంగా చేయాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు ఖండివరంలో 'గడప గడపకు'

చీడికాడ: ఖండివరంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరుకానున్నారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, పార్టీ అనుబంధ సంస్థలు అధ్యక్షులు పాల్గొనాలని కోరారు.

పాత పద్ధతిలో ఉపాధి మేలు

కె.కోటపాడు: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని గతంలో చేసిన విధంగా అమలు చేయాలని సీపీఎం నాయకుడు ఈర్లె నాయుడుబాబు కోరారు. సోమవారం ఎ.కోడూరు రంగరాజు చెరువులో ఉపాధి వేతనదారులతో ఆయన మాట్లాడారు. ఇతర ప్రాంతాలకు ఉపాధి పనులకు వెళ్లే వేతనదారులు రవాణా చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలని, మంచి నీటి అలవెన్స్ అందించాలని కోరారు.

20న మండల సర్వసభ్య సమావేశం

దేవరాపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 20న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పే విధంగా అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

జంపెనలో 53 మందికి వైద్య సేవలు

మాడుగుల రూరల్: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా సోమవారం జంపెనలో వైద్యాధికారి శ్రీలక్ష్మి 53 మంది రోగులను పరీక్షించారు. ప్రధానంగా బీపీ, సుగర్, వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఎం.ఎల్.హెచ్‌పీ అశ్విని, ఆరోగ్య సహాయకుడు నాగేశ్, ఏఎన్ఎం శ్రీదేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. కె.జె.పురం పీహెచ్‌సీ పరిధి మాడుగుల–2 ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో 50 మందిని వైద్యాధికారి కె. లీలాప్రసాదు పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గొండుపాలెంలో..

కె.కోటపాడు: గొండుపాలెంలో సోమవారం ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల 112 మందిని పరీక్షించారు. ఇళ్లకు వెళ్లి ఎనిమిది మందికి వైద్య సేవలందించారు.

ఘనంగా ముగిసిన గౌరీపరమేశ్వరుల వేడుకలు



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : గత రెండు రోజులుగా జరుగుతున్న స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. గౌరీపరమేశ్వరులను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, నియోజకవర్గ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనను రత్నాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు పాల్గొన్నారు.

6 నుంచి మహిళలకు ఎంబ్రాయిడరీ, మగ్గంపై శిక్షణ

అనకాపల్లిటౌన్ : భారతీయ స్టేట్ బ్యాంకు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో జూన్ 6 నుంచి గ్రామీణ ప్రాంత మహిళలకు ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణా కాలంలో మహిళలకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం అందిస్తామన్నారు. 18 ఏళ్ల నిండి 45 ఏళ్లలోపు వయసుండి, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 8008333509 నంబర్లో సంప్రదించవచ్చన్నారు.

నేటి నుంచి 'ప్రకృతి' సాగు కిట్ల పంపిణీ

కొయ్యూరు : మండలంలో ప్రకృతి వ్యవసాయం చేసే గ్రామాల రైతులకు నవ ధాన్యాలు, చిరు ధాన్యాల కిట్లను మంగళవారం నుంచి జి.భీమవరం రైతు భరోసా కేంద్రంలో సరఫరా చేయనున్నట్లు ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి ద్వారపురెడ్డి రమణ సోమవారం తెలిపారు. సుమారు 30 రకాలతో కూడిన 12 కిలోల విత్తనాల కిట్ రూ.వెయ్యిగా పేర్కొన్నారు. ఈ విత్తనాలు ఎకరాకు సరిపోతాయని, వీటిని రుతు పవనారంభంలో వచ్చే వర్షాల్లో దున్నుకుని, సిద్ధంగా ఉంచుకున్న భూముల్లో జల్లుకోవాలన్నారు. ఇవి మొలిచి, ఎదిగిన 45 రోజుల తర్వాత భూమిలో కలియ దున్నుకుంటే సహజసిద్ధంగా సేంద్రీయ కర్బన శాతం వృద్ధి చెంది, నేల సారవంతమవుతుందన్నారు. అనంతరం ప్రధాన పంటలు పండించుకోవచ్చన్నారు. దీనికి యూరియా, డీఏపీ వంటి ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదన్నారు. సుమారు 5 వేల వరకు ఎరువుల ఖర్చు మిగులుతుందన్నారు. అంతేకాకుండా నవ, చిరు ధాన్యాల సాగులో ఆకు కూరలు, కూరగాయలు కూడా ఉంటాయన్నారు. వాటిని ఇంటి అవసరాలకు వినియోగించుకోవడంతోపాటు అదనంగా ఆదాయం పొందవచ్చన్నారు. మండలంలోని 11 గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ భూముల్లో నవ, చిరు ధాన్యాల సాగుకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేసి, విక్రయించడానికి సన్నాహాలు చేశామన్నారు. ఇతర రైతులకు కూడా వీటిని అందిస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు.

సత్యనారాయణస్వామి భూముల కౌలు వేలం రేపు

అనకాపల్లిటౌన్ : స్థానిక సుంకరమెట్ట సత్యనారాయణస్వామి వారి దేవాలయం హక్కుభుక్తంలో భాగంగా ఈ నెల 17న ఆలయ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె.ఆదినారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వే నెం.1616/1లో 2.38 ఎకరాలు, సర్వే నెం.1662/2సీలో 58 సెంట్లు, సర్వే నెం.1662/2బీలో 56 సెంట్లును ఈ ఏడాది జూన్ 1 నుంచి 2026 మే 31 వరకు మూడేళ్ల కౌలుకు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు. హెచ్చు పాటదారు శిస్తు ముందస్తుగా చెల్లించాలని కౌలు ఖరారు చేసుకోవచ్చన్నారు. పాటదారులు ఆధార్ కార్డు, రూ.లక్ష సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను ఆలయ అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించారు.

త్రిపురాంతక స్వామికి ప్రత్యేక పూజలు

కొయ్యూరు : స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు ఎక్కువగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

ఎదిగొచ్చిన కొడుకు దుస్థితిపై వేదన

- తల్లిదండ్రులకు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ భరోసా
- రూ.10 వేల పింఛన్ మంజూరుకు సిఫార్సు
- మరుపాకలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



మంచానికే పరిమితమైన శ్రీనును పరామర్శిస్తున్న ధర్మశ్రీ



రాజులమ్మ నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ధర్మశ్రీ

రావికమతం: ఎదిగొచ్చిన కొడుకు డిగ్రీ వరకు చదివాడు.. ఇక ప్రయోజకుడై తమ కష్టాలు గట్టెక్కిస్తాడని ఆ తల్లిదండ్రులు రామరాజు, కుమారి గంపెడాశలు పెట్టుకున్నారు. ఇంతలో ఉన్నపళంగా అతడు అపస్మారక స్థితికి చేరాడు. ఎన్నో ఆస్పత్రులకు తీసుకెళ్లారు. వైద్యానికి తమ సంపాదనంతా ధారపోశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. నరాల బలహీనత సమస్యతో రెండేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మరుపాక వచ్చిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి మొరపెట్టుకున్నారు. దీనికి ఆయన స్పందించి వారి కుమారుడు కర్నం శ్రీను (26) పరామర్శించారు. ఎంపీడీవో వెంకన్నబాబు, జిల్లా అధికారులతో మాట్లాడారు. అతడికి తక్షణమే రూ.10 వేల పింఛన్ మంజూరుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మరుపాక, నాగన్నపాలెం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాగన్నపాలెం–రావికమతం రోడ్డును తారురోడ్డుగా మార్చాలని గ్రామస్తులు గొర్లె రామునాయుడు, బాబులు, రాము తదితరులు కోరారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేసేందుకు హామీ ఇచ్చారు. మోదకొండమ్మ తల్లి ఆలయానికి మండపం నిర్మించాలని, గ్రామంలో సీసీడ్రైనేజీలు, రోడ్డు వేయాలని సోమిరెడ్డి చినబాబు, వెంకట్రావు, పెదపాటి చినమ్మలు ఆయన దృష్టికి తెచ్చారు. ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు రూ.75 లక్షలు మంజూరయ్యాయని, పనులు పూర్తి చేయాలని రాయపాటి రాజులమ్మ, గాది రమణమ్మ పలువురు గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, సర్పంచ్ పండూరి లావణ్య, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మీనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, నాయకులు రావిగోవిందరావు, పండూరి సత్తిబాబు, ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలతో 'ఉపాధి'కి దూరం

- తిమిరాం ఉపాధి హామీ కూలీల నిరసన



దేవరాపల్లి తహసీల్దార్ లక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న తిమిరాం వేతనదారులు

దేవరాపల్లి: తిమిరాం రెవెన్యూ పరిధిలోని చెరువుల ఆక్రమణలను తొలగించి, ఉపాధి హామీ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామ వేతనదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఎదుట సోమవారం వారు నిరసన చేపట్టారు. గ్రామంలోని ఏడు చెరువులు ఉండగా, వీటిలో ఐదు చెరువులు ఆక్రమణకు గురయ్యాయని వాపోయారు. వెంటనే ఆక్రమణలు తొలగించి ఉపాధి పనులు చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. ఆక్రమణ చెరువుల్లో ఉపాధి పనులు చేస్తున్న తమను ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అధికారులు తక్షణమే స్పందించి సర్వే జరిపి చెరువుల్లో ఆక్రమణలు తొలగించి, తమకు పనులు కల్పించాలని ముక్త కంఠంతో కోరారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం. లక్ష్మి, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మిలకు వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించారు.

ఆక్రమణలు తొలగించండి

- డ్రైనేజీని బాగు చేయండి
- ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఆదేశం



ఆక్రమణకు గురైన కాలువను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు



రోడ్డుపై పారుతున్న మురుగు

రావికమతం: మండుటెండల్లోనూ ఆర్అండ్‌బీ రోడ్డుపై మురుగు నిలిచి ఉండటంతో అటుగా వచ్చిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సోమవారం పరిశీలించారు. అదంతా దుర్వాసన వస్తుండటంతో విషయం అడిగి తెలుసుకున్నారు. రహదారికి ఒక పక్కన ప్రధాన డ్రైనేజీ ఆక్రమణలకు గురై పూడిక పోయిందని, ఆ నీరంతా రోడ్డుపై పారుతుండటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని తెలుసుకున్నారు. వెంటనే ఆర్అండ్‌బీ జేఈ సాయిశ్రీనివాస్, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు ఇతర అధికారులకు ఫోన్ చేసి రప్పించారు. ఇక్కడ అధ్వాన పరిస్థితి కనిపించలేదా? అని ఆగ్రహించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా రోడ్డుకు ఇరువైపులా కాలువలపై ఆక్రమణలు గుర్తించి స్వచ్ఛందంగా తొలగిపోవాలని, లేదంటే తొలగిస్తామని నోటీసులివ్వాలని ఆయన ఆదేశించారు. దీంతో అధికారులు వెంటనే రోడ్డుకు ఇరువైపులా చెరొక నలభై అడుగుల మేర ఆక్రమణలు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి

- ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, డిప్యూటీ సీఎం సతీమణి రమణమ్మ సంతాపం



ఎరుకునాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చీడికాడ: ఖండివరంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకర ఎరుకునాయుడు(94) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. అతడి కుమారుడు పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసరావును చోడవరం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, జెడ్పీటీసీ దొండా రాంబాబు, మాజీ జెడ్పీటీసీ గోవిందరావు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టరు గొల్లవిల్లి ప్రభావతి, గొల్లవిల్లి సంజీవిరావు పరామర్శించి సంతాపం తెలిపారు. ఎరుకునాయుడు పార్థివదేహానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్య వివాహం విరమించుకోవాలని నోటీసు

దేవరాపల్లి: బాల్య వివాహాన్ని విరమించుకోవాలని స్థానిక గ్రామ సచివాలయం–1 మహిళా పోలీస్ గొర్లె వరలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం బాలిక తల్లిదండ్రులకు బాల్య వివాహ నిరోధక చట్టం నోటీస్‌ను అందజేశారు. ఇక్కడ ఎస్టీ కాలనీలో ఇంటర్ చదువుతున్న బాలికకు మల్లునాయుడుపాలెంకు చెందిన యువకుడితో వివాహం నిశ్చయించినట్లు సమాచారం తెలుసుకున్నారు. వారు బాలిక ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారు. వివాహానికి యువతికి 18 ఏళ్లు, యువకుడికి 21 ఏళ్లు నిండి ఉండాలని, ఈ లోపు వివాహం చేస్తే చట్టా రీత్యా నేరమని హెచ్చరిక జారీ చేశారు. తల్లిదండ్రులతోపాటు పెళ్లికి సహకరించే పెద్దలు, కుటుంబ సభ్యులకు సైతం రెండేళ్ల జైలుశిక్ష లేదా లక్ష రూపాయలు జరిమానా విధిస్తారని వివరించారు.